క్లుప్తంగా

సాక్షిగణపతికి విశేష పూజలు




సాక్షిగణపతి   జ్వాలా వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతికి పంచామృతాలు, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేసిన కొండా మధుసూదన్‌రెడ్డి

మహానంది: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన తండ్రి, కుమారులు సుబ్బడు, లింగమయ్య కుటుంబాలకు గాజులపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొండా మధుసూదన్‌రెడ్డి బుధవారం రూ. 7వేలు ఆర్థిక సాయం అందించారు. బాధితులను పరామర్శించారు. తీవ్రంగా నష్టపోయినవారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పాఠశాల పరిశీలించిన ఎంపీ



విద్యార్థులతో మాట్లాడతున్న ఎంపీ బైరెడ్డి శబరి

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామం ప్రాథమిక పాఠశాలను బుధవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పరిశీలించారు. విద్యార్థులతో ఎంపీ ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం తీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని, గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనాథ్, నాయకులు తువ్వా భగీరథరెడ్డి, కడుమూరు శివశంకర్ రెడ్డి, గుండం స్వామిరెడ్డి, పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, గోకారి, రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు



మహానందిలోని దుకాణాల వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

మహానంది: కలుషిత ఆహార పదార్థాలు, గడువు ముగిసిన తినుబండారాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాసీం వలి, వెంకటరాముడు హెచ్చరించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మహానందిలో బుధవారం ఆలయ పరిసరాల్లోని హోటళ్లు, కూల్‌డ్రింక్ షాపులు, ఇతర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూల్‌డ్రింక్స్, ఆహార పదార్థాలు, తినుండారాలను పరిశీలించారు. పలు కంపెనీల ఉత్పత్తులపై ఎక్స్‌పైరీ తేదీ, తదితర వాటిని చూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఒప్పంద జీవోలు విడుదల చేయాలి



డాక్టర్ సాజిదాకు వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: ఆశా కార్యకర్తల ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, సి.వరలక్ష్మి, ఇందిరమ్మ కోరారు. బుధవారం పట్టణంలోని అర్బన్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సాజిదాకు ఆశా కార్యకర్తలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులు యూనియన్ రాష్ట్ర ప్రతినిధివర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలపై జీవోలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శాంతి, నాగలక్ష్మి, వరలక్ష్మి, లింగమ్మ, రవణమ్మ, సామ్మక్క తదితరులు పాల్గొన్నారు.

- ప్రజలకు అందని కనీస సేవలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు
- సమయపాలన పాటించని ఉద్యోగులు

సచివాలయాల సేవలు నిర్వీర్యం

పగిడ్యాల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. ఇప్పటికే సచివాలయాల సేవలు సక్రమంగా ప్రజలకు అందడం లేదు. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగుల తీరు మరీ ఆందోళనకరంగా ఉంది. ఏ మాత్రం సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు సచివాయాల దగ్గర నిరీక్షించాల్సి దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు అప్పుడప్పుడు తనిఖీ చేయడం పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించడాలు తప్పా చేసిందేమీ లేదని విమర్శలు లేకపోలేదు. కూటమి సర్కార్ ఐదు నెలల పాలనలో చేసిందేమీ లేదని, గత ప్రభుత్వ పథకాల పేర్లు మార్చడం తప్పా అంటూ గ్రామీణులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. సచివాలయాల సేవలు



పని వేళలో తలుపులు తెరుచుకోని నెహ్రూనగర్ సచివాలయం 2 కార్యాలయం

ఒక్కొక్కటిగా తగ్గిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పకే ఆధార్ సేవలు అందడం లేదు. దీంతో మార్పులు, చేర్పుల కోసం పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది గ్రామీణులు.

ఉద్యోగుల కోసం తప్పని నిరీక్షణ

పగిడ్యాల మండలలో ఎనిమిది గ్రామ పంచాయతీలు, 17 మజరాలు ఉన్నాయి. మొత్తం పది సచివాలయాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అన్ని సేవలు సచివాలయాల్లో అందేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాయాల సేవలు నిర్వీర్యం అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బలు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ తీరుకు తగ్గట్టే కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు వచ్చిందే సమయం అన్నట్లుగా ఉంది సచివాలయ ఉద్యోగుల తీరు. చాలా వరకు సమయానికి కార్యాలయాల తలుపులు తెరవడం లేదు. బస్సు వేళలే సచివాలయ ఉద్యోగుల పనివేళలుగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సచివాలయ ఉద్యోగులు అందించిన సేవలను ఆయా గ్రామాల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

సేవలు ఏ మాత్రం అందడం లేదు....



మనవరాలి బర్త్ సర్టిఫికెట్‌లో పేరు తప్పుగా ఉంది. మార్పించాలని సచివాలయానికి వస్తే ఇక్కడ ఒక్క అధికారి కూడా రాలేదు. కార్యాలయం తలుపులు తెరువలేదు. అపార్ ఐడీ కోసం ఈనెల చివరి వరకు గడువు పెట్టారు. పేరు మార్చకపోతే అపార్ ఐడీ ఆన్‌లైన్‌కు సమస్యలు వస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అందుకని సచివాలయానికి వస్తే ఇక్కడా అధికారులు లేరు. సచివాలయాల్లో సేవలు సక్రమంగా అందడం లేదు. – సుశీలమ్మ, నెహ్రూనగర్

చాలా ఇబ్బందిగా ఉంది...



మాది పీకే ప్రాగటూరు గ్రామం. సచివాలయానికి మా గ్రామానికి దాదాపు 2 కిలో మీటర్లు దూరం ఉంటుంది. ఉదయం పదిగంటలకే సచివాలయం వద్దకు చేరుకున్నా. ఇక్కడ కార్యాలయం తెరువలేదు. బస్సు వస్తేనే అధికారులు వస్తారని స్థానికులు చెప్పారు. అందుకని కార్యాలయం వద్దనే పడిగాపులు కాస్తున్నా. చాలా ఇబ్బందివగా ఉంది. సేవలు సక్రమంగా అందడం లేదు. – మద్దిలేటి, పీకే ప్రాగటూరు

పది గంటలకు కార్యాలయంలో ఉండాలి

సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలి. ఉద్యోగులు తప్పనిసరిగా పది గంటలకు కార్యాలయానికి చేరుకోవాలి. సమయపాలన పాటించని ఉద్యోగులపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటాం. – సుమిత్రమ్మ, ఎంపీడీఓ

మద్యం మత్తులో వీరంగం

పగిడ్యాల: స్థానిక జిన్ను కాలనీ వద్ద బుధవారం రాత్రి ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. నడి రోడ్డేపైనే పడుకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నందికొట్కూరు నుంచి సంకిరేణిపల్లెకు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు 20 నిమిషాల పాటు నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. స్థానికులు ఎంత పిలిచినా ఆ వ్యక్తి ఉలుకు పలుకు లేకుండా ఉన్నాడు. దీంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విసుగు చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో రోడ్డుపై పడుకున్న వ్యక్తి కాలుపట్టి పక్కకు లాగేశాడు. అప్పుడు ఆర్టీసీ బస్సు ముందుకు సాగింది.

ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్‌పరం చేయొద్దు

నందికొట్కూరు: ప్రభుత్వరంగ సంస్థలపు ప్రైవేట్‌పరం చేస్తే ప్రజలతో కలిసి అడ్డుకుంటామని ఏఐటీయూసీ మండల కార్యదర్శి వెంకటశివుడు హెచ్చరించారు. బుధవారం కొత్తపల్లి మండల పరిధిలోని సింగరాజుపల్లె గ్రామంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేయాలని చూస్తే ఆందోళన కార్యక్రమాలను చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మోక్షేశ్వరుడు, బీమలింగం, స్వాములు, సురేష్, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య ప్రజా వేదిక

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన 18వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక పోలీస్ బందోబస్తు మధ్య సాగింది. మండలంలోని 8 గ్రామ పంచాయతీలలో డీఆర్‌పీలు పరిశీలన చేసి గుర్తించిన అవకతవకలపై ప్రజావేదికలో గ్రామ పంచాయతీల వారీగా చదివి వినిపించారు. సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన సర్వేలో ప్రిసైడింగ్ అధికారి బాలాజీ నాయక్ రూ. 4,02,369లు రికవరీ, రూ. 2,000 పెనాల్టీ విధించినట్లు ఎస్ఆర్‌పీ మురాద్ తెలిపారు. అనంతరం పగిడ్యాల ఫీల్డ్‌అసిస్టెంట్ రమేష్‌పై టీడీపీ కార్యకర్తలు చేసిన ఆరోపణలపై ప్రిసైడింగ్ అధికారి ప్రజా వేదికలోనే విచారణ ప్రారంభించడంతో ఒక్కసారిగా ప్రజావేదిక ఉద్రిక్తంగా మారింది. ఫీల్డ్ అసిస్టెంట్‌లపై రాజకీయ జోక్యం తగదని ప్రజా సంఘాల నాయకులు, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధికారులకు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిసైడింగ్ అధికారి బాలాజీనాయక్

విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన ప్రిసైడింగ్ అధికారి కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని, ఫీల్డ్‌అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడలేదని అర్జీ ఇస్తే స్వీకరిస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. కార్యక్రమంలో మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ అధికారి భాస్కరానాయుడు, ఏపీడీ అన్వరాబేగం తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి

మిడుతూరు: రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సమితి నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే ప్రతి రైతుకు రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తానని .. ఇప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా సమితి నాయకులు

సిద్ధాపురానికి బస్సు సర్వీసు పునఃప్రారంభం

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం గ్రామానికి వెంకటాపురం మీదుగా ఆర్టీసీ అధికారులు రెండేళ్ల తరువాత బస్సు సర్వీసును పునరుద్ధరించారు. ఈ మేరకు బుధవారం తొలి సర్వీసు రాగా.. వెంకటాపురం ఉన్నత పాఠశాలలో బస్సు డ్రైవర్ షేక్ ఫక్రుద్దీన్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం వెంకటరమణ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా సిద్ధాపురం గ్రామానికి బస్సు సౌకర్యం లేక వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు, బడి పిల్లలు, కాలేజీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకుని ఆర్టీసీ డిపో అధికారులు బస్సు సౌకర్యం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాలిబ్‌అహ్మద్, వలిబాషా, రాజానాయక్, శోభన్‌బాబు, నాయక్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డ్రైవర్ షేక్ ఫక్రుద్దీన్‌ను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

తూకంలో మోసం

మహానంది: ఎండీయూ వాహనాల్లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో డీలర్లు దగ్గరుండి మోసాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాలు కలిపి మొత్తం 12,248 కార్డులు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి నెలా 1658.12 క్వింటాళ్ల బియ్యం, 27.56 క్వింటాళ్ల జొన్నలు, 25 క్వింటాళ్ల రాగులు, కందిపప్పు వస్తాయి. అయితే కొన్ని గ్రామాల్లో రేషన్ డీలర్లు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్లు కార్డుదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల పరిధిలో అధిక శాతం గిరిజనులు ఉన్నారు. వారిలో నిరక్షరాస్యులు ఉండటంతో తూకంలో తకరార్ చేస్తూ మోసం చేస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



15కిలోల బియ్యానికి తూకం వేస్తే 13 కిలోలు వచ్చిన దృశ్యం

మహానందిలో ఓ లబ్ధిదారుడు 15కిలోల బియ్యం తీసుకుని ఇంటికి వచ్చాక అనుమానం వచ్చి సమీపంలోని దుకాణంలో తూకం వేయిస్తే 13కిలోలే రావడంతో కంగుతిన్నాడు. మండల తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కార్డుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కరివేనలో ‘పొలం పిలుస్తోంది’

ఆత్మకూరు:మండలంలోని కరివేన గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏడీఏ బి.ఆంజనేయులు, పట్టు పరిశ్రమశాఖ ఏడీఏ నగేష్, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి నిర్వహించారు. వారు మాట్లాడుతూ రబీ పంటలకు చేయించుకోవాల్సిన క్రాప్ ఇన్సూరెన్స్ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ప్రభుత్వం 33 శాతం సబ్సిడీపై ఇస్తున్న మినుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న మినుము పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ ఎంపీఈఓ శ్రీనివాసులు, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యవారిపల్లిలో..

వెలుగోడు: మండలం లోని బోయరేవుల పంచాయతీ మజరా గ్రామమైన అయ్యవారిపల్లి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ పవన్ కుమార్ రైతులకు ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను మరియు పంటల యాజమాన్యం గురించి, పంటల్లో చీడపీడల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ కిషోర్ తో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది అర్పిత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ బి.ఆంజనేయులు

సంగమేశ్వరంలో విశేష పూజలు

నందికొట్కూరు: మండలంలోని సంగమేశ్వర ఆలయంలో ఎగువ పుష్కర ఘాటు వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో కార్తీక మాసంలో భాగంగా బుధవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి కృష్ణా జలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళ హారతిమ వంటి విశేష పూజా కార్యక్రమాలు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ నిర్వహించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థినికి బహుమతి

బండిఆత్మకూరు: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో అన్ని పాఠశాలు, కాలేజీల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని సునయన ఉత్తమ ప్రతిభ కనబరించింది. ఈ మేరకు ఆమెకు జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా రూ.2వేలు బహుమతిగా ఇచ్చినట్లు బండిఆత్మకూరు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు.

ముసలిమడుగులో ‘పొలంబడి’

నందికొట్కూరు: మండల పరిధిలోని ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాల్లోని పొలిమేరలో బుధవారం ఏఓ మహేష్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కంది పంటను ఏఓ పరిశీలించారు. కంది పంటలో యాజమాన్య పద్ధతులను వివరించారు. పూత దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆబీకేలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

నందికొట్కూరు: కూలీలు అడిగిన వెంటనే ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ హరికృష్ణ సిబ్బందికి సూచించారు. బుధవారం కొత్తపల్లి మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవాలి

జూపాడుబంగ్లా: రైతులు అధికమోతాదులో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని తంగడంచ గ్రామంలో ‘పొలం పిలుస్తుంది’ కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు.

మినుము విత్తనాల పంపిణీ

పాములపాడు: మండలంలో అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ఉచితంగా మినుము విత్తనాల చిరు సంచులను బుధవారం పంపిణీ చేశారు. ఏఈఓ మద్దిలేటి మాట్లాడుతూ ప్రతి రైతుకు 4 కేజీల ప్యాకెట్ వీబీఎన్ 8 రకం విత్తనం అందించామన్నారు. వీటిని 2 సంవత్సరాల నుంచి ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఈ రకం విత్తనం చీడ పీడలను తట్టుకొని, అధిక దిగుబడి ఇస్తుందని తెలిపారు. వీఏఏ గాయత్రీ, సిబ్బంది చాంద్‌బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడాస్ఫూర్తి అవసరం

శ్రీశైలం : యువతకు క్రీడాస్ఫూర్తి అవసరమని సీఐ ప్రసాద రావు అన్నారు. క్షేత్ర పరిధిలోని ఆగమ పాఠశాలలో ఉన్న మైదానంలో జరుగుతున్న ప్రీమియం లీగ్ మెగా టోర్నమెంట్ నిర్వహించారు. బుధవారం టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్య వల్ల జ్ఞానం, క్రీడల వల్ల దేహదారుఢ్యం కలుగుతుందని అన్నారు. మెరుగైన క్రీడా నైపుణ్యం కలిగిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా లభించే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం ఆయన ప్రీమియం లీగ్‌లో గెలుపొందిన యువకులకు జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ పోలీసులు రఘునాథుడు, మహేందర్‌రెడ్డి, రవిస్వామి, ఎల్లా శేఖర్‌రెడ్డి, టోర్నమెంటు ఆర్గనైజర్ బాబు రావు పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న సీఐ

సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

పగిడ్యాల: శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా శాంతియుత వాతావరణంలో సమస్యలను పరిష్కరించుకోవాలని ముచ్చుమర్రి ఎస్ఐ సి. శరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఎం. ఘణపురం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎస్ఐ మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కువగా భూ సమస్యలు, పొలం గట్ల సమస్యలు, కుటుంబ కలహాలు తదితర సమస్యలు తరచు ఉత్పన్నమవుతుంటాయని, అయితే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన లేకుండా చిన్న చిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని కక్షలు పెంచుకోరాదన్నారు. భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఎవ్వరూ ప్రవర్తించరాదన్నారు. చట్టాన్ని ఎవ్వరూ చేతల్లోకి తీసుకోరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి

అఘాయిత్యాలకు పాల్పడితే శిక్షలు తప్పవు

నందికొట్కూరు: వృద్ధులపై, మహిళలపై, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే శిక్షలు తప్పవని రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కొత్తపల్లి మండల పరిధిలోని నందికుంట గ్రామంలో సీఐ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలపై, బాలికలపై వృద్ధులపై అత్యాచారాలకు పాల్పడినట్లు రుజువైతే చట్టం కఠినంగా శిక్షిస్తుందని చెప్పారు. గ్రామంలో అందరు కలిసికట్టుగా ప్రశాంతంగా జీవనం సాగించాలని కోరారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసు స్టేషన్ ఆశ్రయించాలని, చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని సూచించారు. ద్విచక్ర వాహనం హెల్మెంట్ లేకుండా నడిపితే జరిమానా తప్పదన్నారు. చిన్న పిల్లలకు వాహనాలిస్తే ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయడం ఖాయ మని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కేశవ్, పోలీసులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

శ్మశానవాటికలో పంటకాల్వ ఏర్పాటు తగదు

జూపాడుబంగ్లా: పాములపాడు మండలం కృష్ణరావుపేట లోని ముస్లింల శ్మశానవాటికలో పంటకాల్వ ఏర్పాటు చేయొద్దంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ 30ఏళ్ల క్రితం జూపాడుబంగ్లా మండలంలోని 80బన్నూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 125లో 65సెంట్ల స్థలాన్ని కృష్ణరావుపేట గ్రామానికి చెందిన ముస్లింలకు కర్నూలు-గుంటూరు రహదారి పక్కన శ్మశానవాటిక నిమిత్తం కేటాయించారు. నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా పంటకాల్వను తమ శ్మశానవాటికలో తవ్వుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ సత్వరమే చర్యలు తీసుకొని పంటకాల్వ తవ్వకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రమేష్‌బాబు, కృష్ణరావుపేట ముస్లిం లు పాల్గొన్నారు.



జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కృష్ణరావుపేట ముస్లింలు




గూగుల్‌మ్యాప్ చూపిస్తున్న వలంటీర్ భర్త సాగర్, ప్రహరీలను కూల్చిన దృశ్యం

ఆక్రమణల కూల్చివేత

- కక్షసాధింపుతోనే అని బాధితుల ఆరోపణ

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలోని భ్రమరాంబా టాకీస్ పక్కన నిర్మించిన అక్రమ గోడలు రెండింటిని రెవెన్యూ, పోలీస్ అధికారులు బుధవారం కూల్చివేశారు. అయితే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైనందునే కక్ష సాధింపుతోనే ప్రహరీలను కూల్చి వేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రహరీ భ్రమరాంబా టాకీస్ తాత్కాలిక లీజుదారు శ్రీనివాసగౌడ్‌ది కాగా, రెండవది గ్రామ వలంటీర్‌గా పనిచేసిన లావణ్య కుటుంబానిది. ఆక్రమణలపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు గోడలను కూల్చివేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా వలంటీర్ లావణ్య భర్త సాగర్ మాట్లాడుతూ నా భార్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ వలంటీర్‌గా పని చేసిందని, మేము వైఎస్సార్‌సీపీకి అనుకూల వ్యక్తులమనే కక్షతో మా ప్రహరీని కూల్చి వేశారని ఆరోపించారు. గూగుల్‌మ్యాప్‌లో సైతం రోడ్డు మా ప్రహరీకి అవతల ఉన్నప్పటికీ కావాలనే పగులగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.